నమస్తే తెలంగాణ
# వికారాబాద్
I | హైదరాబాద్, శుక్రవారం 25 అక్టోబర్ 2024 | VIKARABAD


సమావేశంలో మాట్లాడుతున్న రంగారెడ్డి కలెక్టర్ శశాంక

### ● ఇప్పటి వరకు ఎన్ని కూల్చేశారు?

హైడ్రా ఓఆర్ఆర్ పరిధిలోని చెరువులు, నాలాలు, ప్రభుత్వ ఖాళీ స్థలాలు, జంట జలాశయాలు ఎఫ్‌టీఎల్‌లో కట్టడాలను, పార్కు స్థలాల్లో మొత్తం 23 చోట్ల 262 నిర్మాణాలను కూల్చివేసి 111.72 ఎకరాలు స్వాధీనం చేసుకుంది. రెండు నెలల పాటు ఈ ప్రక్రియ కొనసాగింది. వీటిలో అత్యధికంగా గాజుల రామారంలోని చింతల్ చెరువుల ఒడ్డున 54 నిర్మాణాలను కూల్చేశారు. రాజేంద్రనగర్‌లోని భూమురక్ డౌలాలో 45 నిర్మాణాలు ఉన్నాయి. ఇదే క్రమంలో లోటస్ పాండ్, మన్సూరాబాద్, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, బాచుపల్లి, చందానగర్, అమీర్‌పేట, అమీన్‌పూర్, గుట్టల బేగంపేట, మల్లంపేటలలో పలు నిర్మాణాలను నేలమట్టం చేశారు.

### ● పేదవారివి ఎన్ని.. పెద్దోళ్లవి ఎన్ని?

హైడ్రా కూల్చివేతల్లో ఇరవై శాతం పెద్దలకు సంబంధించిన నిర్మాణాలు కాగా., మిగతావన్నీ పేదలకు, మధ్యతరగతి వారికి సంబంధించినవి కావడం గమనార్హం. పల్లం రాజు సోదరుడు పల్లం ఆనంద్, కావేరి సీడ్స్ అధినేత జీవీ భాస్కర్ రావు, బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్ రెడ్డి, ప్రొ కబడ్డీ ఓనర్ అనుపమ, సినీ నటుడు నాగార్జున, చింతల్‌లో బీఆర్ఎస్ నేత రత్నాకర్ రాజు ఉన్నారు. పటేల్‌గూడ పరిధిలోని బీఎస్ఆర్ కాలనీ పక్కన ప్రభుత్వ భూమిలో నిర్మించిన 24 ఇళ్లను కూల్చేశారు. నల్ల చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో 16 ఆక్రమణలంటూ రేకుల షెడ్డులను గంటల వ్యవధిలోనే నేలమట్టం చేశారు. సున్నం చెరువులో పేదల ఇళ్లను కూల్చేశారు.

*సగటు నగరవాసి గుండెల్లో గునపం 'హైడ్రా' (హైదరాబాద్ విపత్తుల ప్రతిస్పందన, ఆస్తుల పరిరక్షణ సంస్థ). విపత్తుల నివారణ, ఆస్తుల పరిరక్షణేమో గానీ, సగటు నగరజీవి బతుకునూ చిన్నా భిన్నం చేసింది. హైడ్రా హైదరాబాద్ నగరానికి ఎలాంటి విపత్తులను రాకుండా చేస్తుందో, ప్రభుత్వ ఆస్తులను ఎన్ని వేల ఎకరాల్లో కూడబెడుతుందో.. తెలియదు గానీ, దేదీప్యమానంగా వెలుగుతున్న సామాన్యులు, మధ్య తరగతి వాసుల ఇంటి దీపాలను ఆర్పేసి, వారి జీవితాలను అంధకారం చేసి ఆడుకుంటుంది. ఎంతో మంది పెద్దల ఇండ్లు అనుమతులు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా ఉన్నప్పటికీ వారిపై ఎలాంటి ప్రతాపం చూపలేకపోయింది. సులభంగా దొరికిన సామాన్యుల బతుకులపై హైడ్రా గునపం దింపింది. వంద రోజుల తన ప్రయాణంలో నగరంలోని 23 ప్రాంతాల్లో 262 నిర్మాణాలను నేలమట్టం చేసింది. హైడ్రా చర్యలపై హైకోర్టు సైతం ప్రశ్నించినా.. ఎలాంటి ఉలుకూ పలుకూ లేకుండా ముందడుగు వేస్తూనే ఉంది. రోజుకో రూపంతో సామాన్యుల బతుకుల్లో నిప్పులు పోస్తూనే ఉంది.*





# హడలెత్తిస్తున్న హైడ్రా

## ఏర్పాటై రేపటికి వంద రోజులు


- 23 ప్రాంతాలు.. 262 నిర్మాణాలపై వేటు
- కూల్చివేతల్లో పెద్దోళ్ల ఇండ్ల కంటే పేదవారియే ఎక్కువ
- అనుమతులున్నా.. ఎందుకు కూల్చారు?
- రోజుకొక రూపంతో హడావుడి

సిటీబ్యూరో, అక్టోబర్ 24 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌ను హడలెత్తించిన హైడ్రా.. ఏర్పాటై రేపటికి (శనివారం) సరిగ్గా వంద రోజులు. చెరువుల విపత్తు నిర్వహణతో పాటు ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకోసం ఏర్పాటు చేసిన హైడ్రా ఇప్పటివరకు ఓఆర్ఆర్ లోపల 262 నిర్మాణాలు కూల్చివేసింది. విపత్తు నిర్వహణ, ఆస్తుల రక్షణగా 'హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అస్సెట్' ప్రొటెక్షన్ ఏజెన్సీ హైడ్రాను ఏర్పాటు చేస్తున్నట్లు జూలైలో సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. జీహెచ్ఎంసీ, దాని చుట్టూ ఉన్న 27 మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, 33 గ్రామ పంచాయతీల వరకు ఈ విభాగం పనిచేస్తున్నదని ప్రకటించారు. హైడ్రా ఏర్పాటు చేస్తున్నట్లు జీవో నం.99ను జూలై 19న ప్రభుత్వం విడుదల చేసింది. గవర్నర్ ఆర్డినెన్స్‌పై సంతకం పెట్టిన తర్వాత గెజిట్‌ను విడుదల చేయడంతో హైడ్రాకు పూర్తి అధికారాలు వచ్చినట్లయ్యింది. వందరోజుల హైడ్రా వ్యవస్థలో పెద్దల కంటే పేదలపైనే ఫోకస్ పెట్టి వారి ఇళ్లపైకే బుల్డోజర్లు పంపడంపై విమర్శలు వెల్లువెత్తాయి. కోర్టు సైతం హైడ్రా కమిషనర్‌ను ఈ విషయం లో సీరియస్‌గా ప్రశ్నించిన పరిస్థితి చూశాం. 'కనీసం నోటీసులు ఇవ్వకుండా ఎలా కూల్చేస్తారు?' అని న్యాయస్థానం ప్రశ్నించింది. హైడ్రా 100 రోజుల పరిణామాల్ని చూద్దాం..



**ఉన్నవి రెండు కమిటీలు.. భట్టినే హైడ్రా బాస్!**

హైడ్రా కమిటీకి చైర్మన్‌గా సీఎం రేవంత్ రెడ్డితో పురపాలక, రెవెన్యూ శాఖల మంత్రులు, గ్రేటర్ పరిధిలోని జిల్లాల ఇన్‌చార్జి మంత్రులు, జీహెచ్ఎంసీ మేయర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ, రెవెన్యూ, పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శులు, సమీకృత కమాండ్ కంట్రోల్ కేంద్రం అధిపతి సభ్యులుగా ప్రధానమైన పాలక మండలి ఉంటుంది. విధానపరమైన నిర్ణయాలపై ఈ కమిటీ మార్గ నిర్దేశనం, సమీక్షలు చేస్తుంది. తెలంగాణ కోర్ అర్బన్ రిజియన్(టీసీయూఆర్) పరిధిలోని డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ రెండో కమిటీగా పనిచేస్తుంది. దీనికి పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి చైర్మన్‌గా, ఇతర శాఖలు, విభాగాల ఉన్నతాధికారులు సభ్యులుగా ఉంటారు. ఈ రెండు కమిటీల్లో హైడ్రా కమిషనర్ మెంబర్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, వాటర్ బోర్డు, సిటీ ట్రాఫిక్, వివిధ విభాగాల నుంచి ప్రత్యేక బృందాలు హైడ్రాలో పని చేస్తాయి. హైడ్రాకు విస్తృత అధికారాలు కల్పిస్తూ రాష్ట్ర సర్కార్ తీసుకొచ్చిన ఆర్డినెన్స్‌కు అక్టోబర్ 5న తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆమోదం తెలిపారు. ఐతే, హైడ్రా నిర్వహణకు సంబంధించి రెండు కమిటీలున్నా.. మొత్తం నిర్వహణ విషయంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కనే బాస్‌గా వ్యవహరిస్తున్నారు.



నగరవాసి గుండెల్లో గునపం

### ● అనుమతులు ఉన్నవి ఎన్ని..?

అనుమతులుంటే కూల్చేయమంటూ సీఎం రేవంత్‌తో పాటు హైడ్రా కమిషనర్ రంగనాథ్ ప్రకటించినప్పటికీ.. అంతకు ముందే హైడ్రా కూల్చివేతల్లో అనుమతులున్న భవనాలపై జవాబుదారీ ఎవరు? అనే ప్రశ్న తలెత్తుతోంది. శేరి లింగంపల్లి జోన్ చందానగర్ సర్కిల్ హఫీజ్‌పేట డివిజన్ మదీనాగూడలోని సర్వే నం.26లో ఈర్ల చెరువు బఫర్ జోన్‌లో ఉన్నారంటూ ఆగస్ట్ 19న భవనాలను కూల్చేశారు. తమకు అనుమతులున్నాయని, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ ఉందంటూ భవన యజమానులు చెప్పినా హైడ్రా వినకుండాకూల్చేసింది. మదీనాగూడలోని ఎర్ల చెరువులో కూడా కొన్ని నిర్మాణాలకు అనుమతులిచ్చారు. అయితే, కొన్నిచోట్ల అనుమతులిచ్చిన అధికారులపై ఫిర్యాదులు చేసి కేసులు పెట్టించడం వరకు హైడ్రా ఆలోచించింది తప్ప, ఆ నిర్మాణాల కూల్చివేతలతో మధ్యతరగతి, పేదవారు పూర్తిగా నష్టపోతున్నారని తెలిసీ దూకుడుగా వ్యవహరించింది.

### ● ఏ అధికారాలు బదలాయించారు..

జీహెచ్ఎంసీ పరిధిలోని రోడ్లు, డ్రైనేజీలు, వాటర్ బాడీలు, పబ్లిక్ ప్లేసెస్, పార్కులు తదితర ప్రభుత్వ, జీహెచ్ఎంసీ ఆస్తులు ఆక్రమణకు గురికాకుండా రక్షించడానికి హైడ్రాకు అధికారం కల్పించింది. ప్రభుత్వ ఆస్తులకు సంబంధించి ఆక్రమణలను పరిశీలించడం, నోటీసులివ్వడం, ప్రభుత్వ స్థలాల్లోని ఆక్రమణల తొలగింపునకు అధికారం కల్పించే జీహెచ్ఎంసీ చట్టం 1955లోని సెక్షన్ 374బీని హైడ్రా అధికారాలుగా చేరుస్తూ గవర్నర్ ఇచ్చిన ఆర్డినెన్స్‌కు పొడిగింపుగా, ఈ గెజిట్‌ను ప్రభుత్వం విడుదల చేసింది. జీవోపై కమిషనర్ రంగనాథ్ స్పందిస్తూ హైడ్రాకు విశేష అధికారాలొచ్చాయని, ఇకపై అక్రమ నిర్మాణాల కూల్చివేతకు నోటీసులిస్తుందన్నారు. అదే విధంగా అనధికారిక భవనాలకు సీజ్ చేసే అధికారం కూడా హైడ్రాకు ఉందన్నారు.

### ● సీజ్ చేసింది జీహెచ్ఎంసీ.. హైడ్రా ఏం చేస్తోంది?

హైడ్రా తన అధికారాల్లో అనుమతులు లేకుండా నిర్మాణం జరుగుతున్న ఇండ్లకు, భవనాలకు నోటీసులు ఇస్తామని, అనధికారిక భవనాలను సీజ్ చేస్తామని చెప్పారు. కానీ, వనస్థలిపురం పరిధిలోని సాగర్ కాంప్లెక్స్, బీఎన్‌రెడ్డి నగర్ చౌరస్తాలో, సచివాలయనగర్‌లోని భవనాలను జీహెచ్ఎంసీ అధికారులు బుధవారం సీజ్ చేశారు. అయితే, అనధికారిక భవనాలను సీజ్ చేసే అధికారం తమదేనన్న హైడ్రా ఈ విషయంలో ఎందుకు మాట్లాడటం లేదు. జీహెచ్ఎంసీ అధికారాల బదలాయింపు తర్వాత సీజ్ చేయడం, నోటీసులు జారీ చేయడం వంటి అధికారాలు కలిగిన హైడ్రా ప్రస్తుతం జీహెచ్ఎంసీ పరిధిలో పనిచేయలేకపోవడానికి కారణాలేంటి? గతంలో పనిచేసిన కమిషనర్‌తో పాటు ప్రస్తుతం కమిషనర్‌తోనూ హైడ్రా కమిషనర్‌కు కొంత విభేదాలున్నట్లు తెలుస్తోంది.

### ● రోజుకో రూపంలో.. హడావుడి

హైడ్రా అంటే అనేక తలల జంతువు అన్నట్లుగా హైడ్రా వ్యవస్థ కూడా రోజుకొక రూపంలో హడావిడి చేస్తోంది. కూల్చివేతల నుంచి చెరువుల సుందరీకరణ, నగరంలో డిజాస్టర్ మేనేజ్‌మెంట్.. ఇలా రెండు రోజులు సమీక్షలు నిర్వహించారు. ఆ తర్వాత ఒక ఎన్జీవోతో బెంగళూరు టూర్ ప్లాన్ చేశారు. అటు నుంచి హైడ్రా గ్రేటర్‌లో ట్రాఫిక్‌పై దృష్టి పెట్టింది. ట్రాఫిక్ అడిషనల్ కమిషనర్‌తో కలిసి ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై సమీక్ష నిర్వహించింది. జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ వారితో రెండు రోజులు గ్రేటర్‌లో వాటర్ లాగింగ్ పాయింట్స్ ఎక్కడ ఉన్నాయంటూ రాజ్‌భవన్ రోడ్డు, లక్డీకాపూల్‌లో హడావిడి చేశారు. అటు నుంచి వృక్షాల పరిరక్షణకు అటవీ శాఖ అధికారులతో సమావేశమయ్యారు.

## గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దాలి

**రంగారెడ్డి కలెక్టర్ శశాంక**

- అందుకు ఎంపీడీవోలు కీలక పాత్ర పోషించాలి
- కలెక్టరేట్‌లో సమీక్షా సమావేశం

షాబాద్, అక్టోబర్ 24 : రంగారెడ్డి జిల్లాలోని గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దాలని.. అందుకు ఎంపీడీవోలు కృషి చేయాలని కలెక్టర్ శశాంక సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో కలెక్టర్ ఎంపీడీవోలతో వ్యక్తిగత గృహ మరుగుదొడ్లు, కమ్యూనిటీ శానిటరీ సముదాయాలు, ప్లాస్టిక్, ఘన వ్యర్థాల నిర్వహణ, గ్రే వాటర్ మేనేజ్‌మెంట్ వంటి అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..కొత్తగా నిర్మిస్తున్న ఇండ్లకు ఐహెచ్‌హెచ్ఎల్ఎస్ మంజూరు ద్వారా అన్ని అర్హతలతో హౌస్ హోల్డ్‌లకు అందిస్తామన్నారు. గతంలో ఏదైనా పథకం ద్వారా లబ్ధి పొందిన వారికి ఐహెచ్‌హెచ్ఎల్ఎస్ మంజూరు చేయొద్దన్నారు. వ్యక్తిగత గృహ మరుగుదొడ్లు వినియోగంలో ఉండే లా చూడాలని, సింగిల్ పిట్ టాయిలెట్లను ట్విన్ పిట్ టాయిలెట్లుగా మార్చాలన్నారు. గ్రామాల్లో బహిరంగ మలవిసర్జన జరుగకుండా ఎంపీడీవోలు చొరవ చూపాలన్నారు. కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌లను మండలాల్లోని రెసిడెన్షియల్ స్కూళ్లు, టూరిస్టు ప్రాంతాలు, బస్టాండ్లు, ఆలయాలు, దవాఖానల ఆవరణలు, మార్కెట్ పరిసర ప్రాంతాల్లో నిర్మించాలన్నారు. అంతేకాకుండా షాప్, బాతింగ్, బేబీ ఫీడింగ్ వంటి అవసరాలను కూడా కమ్యూనిటీ సర్వీసెస్ సెల్ అందుబాటులోకి తీసుకురావొచ్చునని సూచించారు. ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ జిల్లా పరిధిలో రెండు యూనిట్లు లేదా ఇంకా ఎక్కువైనా ఏర్పాటు చేసుకోవచ్చునని కలెక్టర్ తెలిపారు.

గ్రే వాటర్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా అన్ని గ్రామాల్లో కమ్యూనిటీ ఇంకుడు గుంతలను ఏర్పాటు చేయాలని, కమ్యూనిటీ సోక్‌పిట్‌లను అన్ని ప్రభుత్వ భవనాల్లో నిర్మించాలన్నారు. కొత్త గ్రామాల్లో సెగ్రిగేషన్ షెడ్లు, సాధ్యమైన చోట ఘన వ్యర్థాల నిర్వహణ షెడ్లను ఏర్పాటు చేయాలన్నారు. వన మహోత్సవంలో భాగంగా ఇప్పటికే నాటిన అవెన్యూ, బ్లాక్ మొక్కలను సంరక్షించేందుకు సరిపడా నీటిని అందించేందుకు వాటర్ ట్యాంకులను అందుబాటులోకి తీసుకురావాలన్నారు. అధికారులు ప్రతి మండలంలో 3 నుంచి 5 గ్రామాలను ఎంపిక చేసుకొని ప్రత్యేక శ్రద్ధ, దత్తత వంటి చర్యలు చేపడుతూ వాటిని మోడల్‌గా తీర్చిదిద్దాలని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, డీఆర్డీవో శ్రీలత, జిల్లా పంచాయతీ అధికారి సురేశ్‌మోహన్, సీపీవో సౌమ్య, మండల అభివృద్ధి అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్

## రైతులకు నష్టం కలిగించం

**వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్**

- అసైన్డ్ భూముల సమస్యను పరిష్కరిస్తాం
- అల్మాస్‌ఖాన్‌పేట్‌లో రైతులతో సమావేశం

కులకచర్ల, అక్టోబర్ 24 : రైతులకు నష్టం కలుగకుండా అసైన్డ్‌భూముల సమస్యను పరిష్కరిస్తామని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. గురువారం మండలంలోని అల్మాస్‌ఖాన్‌పేట్ గ్రామంలో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు భూముల దగ్గరకు వచ్చి సమస్యలను తెలుసుకొని పరిష్కరిస్తామన్నారు. అసైన్డ్ భూములకు సంబంధించి ప్రభుత్వం ఇచ్చే కాగితం మీ చేతుల్లో ఉంటే ఎలాంటి భయం అవసరం లేదన్నారు. అర్హులైన రైతులు నష్టపోకుండా ఉండేందుకు వారికి పట్టాదారు పాస్ పుస్తకాలను అందిస్తామని .. వాటితో రైతుబీమా, రైతుభరోసా పథకాలను పొందవచ్చునని పేర్కొన్నారు.

అనంతరం పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ అల్మాస్‌ఖాన్‌పేట్ భూముల సమస్య పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. ప్రభుత్వం రైతుల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నదన్నారు. అనంతరం వారు చౌడాపూర్ మండలంలోని మక్తవెంకటాపూర్, మందిపల్ గ్రామాలకెళ్లారు. ఈ రెండు గ్రామాల పరిధిలో ఉన్న అసైన్డ్ భూములను సర్వే చేసి రైతుల ఆధీనంలో ఉన్న భూమిని గుర్తించి సరిచేస్తామన్నారు. రైతులు ఆందోళన చెందొద్దని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, ఆర్డీవో వాస్తు, సర్వే ల్యాండ్ ఏడీ రాంరెడ్డి, కులకచర్ల ఎంపీడీవో రామకృష్ణ, తహసీల్దార్ మురళీధర్, డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, ఆంజనేయులు, అశోక్‌కుమార్, ఆనందం, బచ్చిరెడ్డి, అల్మాస్‌ఖాన్‌పేట్ రెవెన్యూ గ్రామాలకు చెందిన రైతులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


చౌదరిగూడ మండల కేంద్రంలో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న విద్యార్థులు

## క్లాసులు కావడం లేదు..

- టీచర్ల అక్రమ డిప్యుటేషన్లను రద్దు చేయండి
- చౌదరిగూడ మండల కేంద్రంలో రోడ్డుపై బైఠాయించి జడ్పీహెచ్ఎస్ విద్యార్థుల నిరసన

షాద్‌నగర్, అక్టోబర్ 24 : ఉపాధ్యాయుల అక్రమ డిప్యుటేషన్లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం చౌదరిగూడ మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు తరగతులు వదిలేసి రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. అక్రమ డిప్యుటేషన్లతో పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు ఇతర బడుల్లోకి వెళ్లడంతో మాకు సరిగ్గా పాఠాలు కావడం లేదని.. పాఠశాలలు ప్రారంభమై నాలుగు నెలలు దాటినా పలు సబ్జెక్టులకు ఉపాధ్యాయులు లేరని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల నిరసనకు ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం నాయకులు మద్దతు తెలిపారు. విద్యార్థుల కోసం డిప్యుటేషన్‌పై వెళ్లిన టీచర్లను వెనక్కి రప్పించాలని అధికారులను డిమాండ్ చేశారు.

# పేరు పేదలది.. పెత్తనం హస్తవాసులది!

## వివాదాస్పదంగా మారిన ఇందిరమ్మ కమిటీల కూర్పు

- తమకు అనుకూలంగా ఉండే వారి పేర్లను చేర్చుతున్న నాయకులు
- పాటించని మార్గదర్శకాలు
- వికారాబాద్ జిల్లాలోని తొమ్మిది మండలాల్లోనే కమిటీలు పూర్తి.. మిగిలిన మండలాల్లో సాగుతున్న ప్రక్రియ

**ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన ప్రకారం.. స్థలం ఉన్న పేదలు ఇండ్లను నిర్మించుకునేందుకు రూ. ఐదు లక్షల చొప్పున పంపిణీ చేస్తామని రేవంత్ సర్కార్ ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే ఇందిరమ్మ ఇండ్ల కోసం ఏర్పాటు చేస్తున్న కమిటీల్లో ఆ పార్టీ వర్గీయులకే అధిక ప్రాధాన్యమిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఆ కమిటీల్లో పేదలకు చోటు దక్కినప్పుడే ప్రభుత్వ సంకల్పం నెరవేరుతుందని.. కానీ, కాంగ్రెస్ నాయకులకు పెత్తనం కట్టబెట్టేలా కమిటీలు వేస్తే.. పేదలకు ఏ విధంగా న్యాయం జరుగుతుందని పలువురు ప్రశ్నిస్తున్నారు. కమిటీల్లో ఉండే వారికి వంగి వంగి దండాలు పెట్టే వారికే ఇండ్లు మంజూరై.. పేదలకు ఇండ్లు రాక అన్యాయం జరిగే అవకాశం ఉంటుందని పలువురు పేర్కొంటున్నారు.**

**-వికారాబాద్, అక్టోబర్ 24 (నమస్తే తెలంగాణ)**


అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతి పేదవాడికీ ఇందిరమ్మ ఇల్లు అంటూ గొప్పగా ప్రకటించిన ఆ పార్టీ నాయకులు..అధికారంలోకి రాగానే మాట మార్చారు. ఇందిరమ్మ పథకం మార్గదర్శకాల ప్రకారం.. కమిటీల ఏర్పాటులో అందరికీ అవకాశం ఇవ్వాల్సి ఉండగా ఆ పార్టీ కేడర్‌కే అధిక ప్రాధాన్యం ఇస్తున్నారనే ఆరోపణలున్నాయి. గ్రామాల్లో పంచాయతీ కమిటీలు, మున్సిపల్‌లో వార్డు కమిటీలను ఏర్పాటు చేస్తున్నారు. గ్రామాల్లో సర్పంచ్ చైర్మన్‌గా, పంచాయతీ కార్యదర్శి కన్వీనర్‌గా ఉంటారు. పట్టణాల్లో అయితే మున్సిపల్ కౌన్సిలర్లు చైర్మన్‌గా, వార్డు అధికారులు కన్వీనర్లుగా ఉంటారు. వారి సమక్షంలో కమిటీలో ఐదుగురు సభ్యులు ఉంటారు. అందులో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల నుంచి ఒక్కొక్కరు, స్వయం సహాయక సంఘాల నుంచి ఇద్దరు సభ్యులుగా ఉండాలని మార్గదర్శకాల్లో పేర్కొన్నారు. ప్రస్తుతం పంచాయతీలకు పాలకవర్గాలు లేకపోవడంతో ప్రత్యేకాధికారులే చైర్మన్లుగా ఉంటారు. కాగా ప్రస్తుతం గ్రామాలు, పట్టణాల్లో ఏర్పాటు చేస్తు న్న ఇందిరమ్మ ఇండ్ల కమిటీల్లో తమకు అనుకూలంగా ఉండే వారినే చేర్చుకొని పెత్తనం చెలాయించే ప్రయత్నం జరుగుతున్నది. ప్రజలను సంప్రదించకుండానే అధికారులు కూడా నాయకులను సంప్రదించి పేర్లను నమోదు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి.

### హస్తం కేడర్‌లో కమిటీల చిచ్చు

ఇందిరమ్మ ఇండ్లు వచ్చేదెప్పుడో.. లబ్ధిదారులు వాటిని సద్వినియోగం చేసుకునేది ఎప్పుడో తెలియదు కానీ.. ఇందిరమ్మ ఇండ్ల కమిటీల్లో తమతమ వర్గీయుల పేరు రాసే విషయంలో మాత్రం అసంతృప్తితోపాటు విభేదాలు ఏర్పడుతున్నాయి. కమిటీలను బహిరంగంగా ఏర్పాటు చేస్తే పారదర్శకంగా ఉండే అవకాశం ఉంటుంది. కుమ్మక్కై కమిటీలను ఏర్పాటు చేస్తుండడంతో కాంగ్రెస్ వర్గీయుల్లో వర్గ పోరు ఆరంభమైనది.

### జిల్లాలోని 9 మండలాల్లోనే పూర్తి..

జిల్లాలో ఇప్పటివరకు కేవలం తొమ్మిది మండలాల్లో మాత్రమే కమిటీలు ఏర్పాటయ్యాయి. మిగిలిన మండలాల్లో మేమంటే మేము ..అన్నట్లుగా కాంగ్రెస్ వర్గీయులు పట్టుదలకు పోతుండడంతో పూర్తి కావడంలేదు. కమిటీల ఏర్పాటు సమయంలోనే ఈ విధంగా ఉంటే ఇందిరమ్మ ఇండ్ల మంజూరు సమయంలో ఎలా ఉంటుందోనని స్థానికులు అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ అంటేనే వర్గ పోరుతో కూడుకుని ఉంటుంది. ప్రస్తుతం ఏర్పాటు చేసిన.. ఏర్పాటు చేస్తున్న కమిటీల్లో అంతర్గత కుమ్ములాటలతో పూటకోసారి సభ్యుల పేర్లు మారుతున్నాయి.



### అందరి సమక్షంలో ఏర్పాటు చేయాలి..



కమిటీలను అంతర్గతంగా, ఎవరికీ తెలియకుండా ఏర్పాటు చేయొద్దు. అర్హులైన పేదలకు న్యాయం జరుగాలంటే అందరి సమక్షంలో ఏర్పాటు చేస్తే బాగుంటుంది. కానీ, ప్రస్తుతం ఏర్పాటు చేస్తున్న కమిటీల్లో కాంగ్రెస్ వర్గీయులే అధికంగా ఉంటున్నట్లు తెలుస్తున్నది.

**-రమేశ్‌బాబు, మాజీ సర్పంచ్, కొడంగల్**



### కమిటీల ఏర్పాటు పారదర్శకంగా జరగాలి..

ఇందిరమ్మ ఇండ్ల పథకం పేదలకు ఉపయోగపడేది. అందువల్ల కమిటీలను పారదర్శకంగా ఏర్పాటు చేస్తే పేదలకు న్యాయం జరుగుతుంది. అర్హులైన పేదలు, ఇండ్లులేని వారికి ఇండ్లను కేటాయిస్తేనే ఈ పథకం సంకల్పం నెరవేరుతుంది.

**-మధుసూదన్‌రావు యాదవ్, 2వ వార్డు కౌన్సిలర్, కొడంగల్ మున్సిపాలిటీ**